# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 19-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:249 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 18: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 607 దరఖాస్తులు అందాయి.

రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 176, హౌసింగ్‌కు సంబంధించి 58 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 54, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి 36, హోం శాఖకు సంబంధించి 62 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి221 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### చురక

నీట్ ప్రశ్న పత్రాలు
నీటుగానే లీకేజా
అంగడిలో సరుకుల్లా
అమ్మకాల్లో ప్యాకేజా.

ప్రమేయం ఎవరిదైన
ప్రభుత్వందే బాధ్యత
పట్టనట్లు చూసుదేల
పరువుబోయె చోద్యత



-వేల్పుల నారాయణ
9440433475

## కిసాన్ సమ్మాన్ నిధి 17వ ఇన్‌స్టాల్‌మెంట్ విడుదల చేసిన ప్రధాని



న్యూఢిల్లీ, జూన్ 18 : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 17వ విడత నిధులను ప్రధాని మోదీ విడుదల చేశారు. ఈ సాయంత్రం ఉత్తరప్రదేశ్ వారణాసిలోని కిసాన్ సదస్సులో రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేశారు.

ప్రధానిగా మూడోసారి మోదీ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ తొలి సంతకం పీఎం కిసాన్ నిధుల ఫైల్‌పై చేశారు. ఈ స్కీం ద్వారా మొత్తం 9 కోట్ల 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.20 వేల కోట్లు జమచేశారు.

ఈ పథకం కింద ఏడాదికి రూ.6 వేలను మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో వేస్తారు. నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు ఇస్తారు. ఇప్పటివరకు 16 విడతలుగా అన్నదాతల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.32 వేల చొప్పున జమ చేశారు. పీఎం కిసాన్ యోజన పథకం నుంచి లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. ఇప్పటికీ ఈ కేవైసీ చేసుకోకుంటే ఇప్పుడైనా చేసుకోవచ్చు. దాని కోసం పీఎం కిసాన్ వెబ్ వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ కు వెళ్లాలి. ఆ వెబ్ సైట్‌లో లబ్ధిదారుల లిస్ట్ ఉంటుంది. అలాగే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు కూడా చేసుకోవచ్చు.

లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమకానున్నాయి. అలా డబ్బులు పడిన వెంటనే మొబైల్‌కు మెసేజ్ రానుంది. ఇప్పటికీ ఈ కేవైసీ పూర్తి చేయని వారిని ఈ జాబితా నుంచి తొలగించారు. అంతే కాదు సరైన పత్రాలు లేకపోయినా, చనిపోయిన రైతులను అనర్హులుగా తేల్చారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా లక్షలాది మంది రైతులకు ఈ సాయం ఖాతాల్లో జమవుతోంది. ఈ కేవైసీ సమస్యల వల్ల ఎక్కువ మంది ఈ ప్రయోజనాన్ని మిస్ అవుతున్నారు. ఈ కేవైసీ చేసుకుంటే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి.

## 0.001 శాతం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. నీట్ అంశంలో ఎన్టీయేని మందలించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 18 : దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యూజీ 2024 పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔెం)పై సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది.

పరీక్షను నిర్వహిస్తున్న ఏజెన్సీగా న్యాయంగా వ్యవహరించాలని మందలించింది. తప్పు జరిగినప్పుడు దాన్ని సరిదిద్దాలని ఎన్టీయేకి సూచించింది. ఎవరైనా 0.001 శాతం నిర్లక్ష్యంగా వ్యవహరించినా దాన్ని పూర్తిగా పరిష్కరించాలని పేర్కొంది. విద్యార్థుల కష్టాన్ని మర్చిపోకూడదని వ్యాఖ్యానించింది. నీట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్టీయేకి తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది.

## మేం పాలకులం కాదు.. సేవకులం : రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 18 :తాము పాలకులం కాదు సేవకులమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ హైదరాబాద్ లోని మల్లేపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ డిజైన్ ను రేవంత్ రెడ్డి పరిశీలించారు. డిజైన్ గురించి సీఎంకు అధికారులు వివరించారు. అదేవిధంగా వలు సాంకేతిక పరికరాలను కూడా సీఎం పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి మాటాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచ అవసరాలకు సరితూగేలా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు ఏటీసీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు రంగంలోని ఇతర ఉద్యోగాలు అందిపుచ్చుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాల వైపు మాత్రమే చూడరని పేర్కొన్నారు. నైపుణ్యం లేకుండా కేవలం సర్టిఫికెట్ ఉంటే ప్రయోజనం లేదన్నారు.

కాగా, ఐటీఐల రూపు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్లాన్? చేసింది. ఏటా రాష్ట్రంలోని ఐటీఐల నుంచి 1.5 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అయితే.. ఈ విద్యను మరింత మెరుగుపర్చి, శిక్షణ పొందేవారి సంఖ్య డబుల్? చేసేలా సీఎం రేవంత్?రెడ్డి ఆలోచించారు. అందులో భాగంగా టాటా టెక్నాలజీస్?తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

అప్‌గ్రేడ్ చేసేందుకు రెడీ..

ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను (మిఎ) ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలు (అడ్వాన్స్- టెక్నాలజీ సెంటర్స్)గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేండ్లకు గానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు రూ.2,324 కోట్ల నిధులను కేటాయించింది.

-65 ఐటీఐలను ఏటీసీలు (అడ్వాన్స్- టెక్నాలజీ సెంటర్స్)గా అప్‌గ్రేడ్ చేస్తారు.

-ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు.

-శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ (టాటా టెక్నాలజీస్ లిమిటెడ్) నియమించనుంది.

-ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల లాంగ్ టర్మ్ కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ అందిస్తారు.

- పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో 4 లక్షల మంది శిక్షణ అందిచనున్నారు.

-ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం ?2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ?307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా ?2016.25 కోట్లు (86.74 శాతం)

- ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి.

-అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు టెక్నాలజీ హబ్‌గా పని చేస్తాయి.

-ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

-ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

## సీఎం రేవంత్ రెడ్డితో లాక్‌హీడ్ మార్టిన్ డైరెక్టర్ భేటీ..



హైదరాబాద్, జూన్ 18 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో లాక్‌హీడ్ మార్టిన్ ఇండియా డైరెక్టర్ మైఖేల్ ఫెర్నాండెజ్, కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబుతో పాటు ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్నతీరుపై ఈ భేటీలో చర్చించారు.

గ్రేటర్ హైదరాబాద్ సిటీ దేశంలోనే శరవేగంగా వృద్ధి చెందుతోందని కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తమ అధ్యయన వివరాలను పంచుకుంది. గడిచిన ఆరు నెలల్లో రియల్టీతో పాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్ లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని అభిప్రాయపడింది.

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని తెలిపింది. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ నుంచి అమెరికాలో ఉంటున్న వారి సంఖ్య, అక్కడి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగిపోయిందని, అందుకే న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

## ఎన్డీయే కూటమిలో అసంతృప్తి.. మోదీ శిబిరంలోని నేతలు మాతో టచ్‌లో ఉన్నారు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 18 : కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మెజారిటీ సాధించడంలో విఫలమైన మోదీ ప్రభుత్వంలోని ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి తన మనుగడ కోసం కష్టపడుతోందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మోదీ శిబిరంలోని కొందరు నేతలు తమతో టచ్‌లో ఉన్నారంటూ బాంబు పేల్చారు.యూకే ఫైనాన్షియల్ టైమ్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆ శిబిరంలోని కొందరు నేతలు మాతో టచ్‌లో ఉన్నారు. ప్రస్తుతం కూటమి మనుగడ కోసం కష్టపడుతోంది. అది బలహీనంగా ఉండటంతో ఏ చిన్న సమస్య అయినా ప్రభుత్వాన్ని కూలదోయొచ్చు' అని వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) ఈ సారి ఇతరులపై ఆధారపడిన విషయం తెలిసిందే. 2014 తర్వాత తొలిసారి బీజేపీ మేజిక్ ఫిగర్ 272 సీట్లను దాటలేక పోయింది. ఇటీవలే వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో మిత్రపక్షాలతో కలిసి ఎన్డీఏ 292 స్థానాలను కైవసం చేసుకుంది. ఇదే సమయంలో ఇండియా కూటమి పార్టీలకు 230కి పైగా సీట్లు రావడం మోదీ దూకుడుకు అడ్డుకట్ట పడినట్లైంది. ఇక చేసేదేమీ లేక కూటమి నేతల మద్దతుతోనే మోదీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ



అమరావతి జూన్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం సచివాలయంలో భేటీ అయినారు. వీరిద్దరి మధ్య దాదాపు గంట పాటు సమావేశం జరిగింది. అనంతరం జనసేన కేంద్ర కార్యాలయానికి పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ బయలుదేరి వెళ్లారు. రేపు(బుధవారం) విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సమావేశంలో పాలనకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎంతో పాటు పవన్‌కు కీలక శాఖల బాధ్యతలు అప్పగించారు. ఈ శాఖలపై చంద్రబాబు పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా.. ఈరోజు సెక్రటేరియట్‌కు వెళ్లిన పవన్ తన చాంబర్‌ను చూడటం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పరిచయం చేసుకున్నారు. సుమారు గంటన్నం పాటు సెక్రటేరియట్‌లో గడిపిన సేనాని.. రెండో బ్లాక్‌లో ఉన్న తన చాంబర్‌ను నిశితంగా పరిశీలించారు. అనంతరం మొదటి బ్లాక్‌కు వెళ్లిన పవన్.. సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎంకు సాదర స్వాగతం పలికిన సీఎం, ఆలింగనం చేసుకున్నారు. అనంతరం పేషీలో కూర్చోని సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ముచ్చటిస్తూ నవ్వుకున్నారు కూడా.!. భేటీ కావడానికి వచ్చిన పవన్‌కు సీటులో నుంచి లేచి ఎదురెళ్లి మరీ.. ఆలింగనం చేసుకున్న సీఎం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా.. సీఎం చాంబర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక చిహ్నం చూపించిన పవన్.. 'మీరు ఆ గుర్తుకు హుందాతనం తెచ్చారు సార్' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు చంద్రబాబు స్పందిస్తూ 'ధన్యవాదాలు పవన్' అని అన్నారు

## శ్రీనగర్‌లో యోగా దినోత్సవ వేడుకలు : హాజరుకానున్న ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 18 :అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో యోగ వేడుకల్లో పాల్గొంటారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానితో కలిసి దాదాపు 9000 మంది యోగా చేస్తారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

జమ్ము కశ్మీర్‌లోని 20 జిల్లాల ప్రజలను వర్చువల్‌గా కనెక్ట్ చేస్తామని, దాదాపు 50,000 మందికి పైగా ప్రజలు కశ్మీర్ నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇక ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచ వెల్లడించారు.

## జియో సేవల్లో అంతరాయం.. స్పందించని యాజమాన్యం..!

హైదరాబాద్, జూన్ 18 : దేశవ్యాప్తంగా ప్రముఖ టెలికం నెట్‌వర్క్ 'జియో' టెలికం సేవలకు అంతరాయం కలిగింది. జియో మొబైల్ నెట్ వర్క్ తోపాటు జియో ఫైబర్ సేవలకూ అంతరాయం కలిగినట్లు సమాచారం. దీనివల్ల వివిధ సంస్థల్లో వర్క్ ఫ్రం హోం సేవలందిస్తున్న ఉద్యోగులు ఇబ్బందులెదుర్కొన్నట్లు తెలుస్తోన్నది. దీంతో జియో యూజర్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.


డౌన్ డిటెక్టర్ వెబ్ సైట్ వెల్లడించిన సమాచారం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2.11 గంటల నుంచి జియో ఫైబర్, జియో మొబైల్ ఇంటర్నెట్, జియో మొబైల్ నెట్ వర్క్ కనెక్టివిటీ విషయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. సాయంత్రం 4 గంటలకల్లా సాంకేతిక సమస్యలు పీక్ స్టేజీకి వెళ్లాయని సుమారు 2400 మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. జియో టెలికం సేవల్లో అంతరాయానికి కారణాలేమిటన్నది తెలియలేదు. దీనిపై రిలయన్స్ జియో అధికారికంగా స్పందించలేదు. జియో కస్టమర్ కేర్ సిబ్బంది కూడా తమ ఫోన్ కాల్స్‌కు యూజర్లు చెబుతున్నారు.

### నేటి కందం- నేటికీ అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

రక్తకణంబుల లోగల
శక్తిని రక్షించగలుగు సామర్థ్యమ్మున్
యుక్తిగ వీక్షించెడి-యా
సక్తికి నీరోజు పూజ సలుపగ వలయున్

(రక్త కణ లోప అవగాహనా దినం..)



-రాధశ్రీ
సెల్:9494481210

## డ్రోన్లతో రవాణా..లాజిస్టిక్స్‌లో సమూల మార్పులు : -స్కైఎయిర్ సీఈవో

హైదరాబాద్, జూన్ 18 :ఆధునిక టెక్నాలజీతో లాజిస్టిక్స్ రంగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇక డ్రోన్ల ద్వారా సంప్రదాయ లాజిస్టిక్స్, రవాణా రంగంలో సమూల మార్పులే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్కైఎయిర్ సీఈవో అంకిత్ కుమార్ తెలిపారు.

వేగం, సామర్థ్యం, నిలకడతో కూడిన సేవల ద్వారా లాజిస్టిక్స్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని చెప్పారు. గురుగ్రాంలో అంకిత్ కుమార్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డ్రోన్లతో లాజిస్టిక్స్ సేవలతో సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు పర్యావరణానికీ మేలు జరుగుతుందని అన్నారు.

పైలట్లు ఈ సాఫ్ట్‌వేర్‌ను వాడటం ద్వారా డ్రోన్ల సేవలు కస్టమర్లకు అందిస్తామని, ప్రతికూల వాతావరణ పరిస్థితులను అంచనా వేసి అందుకు అనుగుణంగా వ్యవహరించేందుకు సెన్సర్లను ఉపయోగిస్తామని తెలిపారు.


## తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు..! పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్..!



హైదరాబాద్, జూన్ 18 : తెలంగాణలో రాగల ఐదురోజులు పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కోస్తాంధ్రను ఆనుకొని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆవర్తనం ఉందని.. అలాగే సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో రాయలసీమ, పరిసర ప్రాంతాల్లో ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది.

గోవా నుంచి దక్షిణ కోస్తాంధ్ర వరకు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో తూర్పు-పడమర ద్రోణి బలహీనపడిందని పేర్కొంది. ఈ క్రమంలో రాగల ఐదురోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే పలుచోట్ల 40-50 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలుంటాయని వాతావరణ విభాగం తెలిపింది. ఈ నెల 22 వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# జన్యుపరమైన అనువంశిక వ్యాధిగా సికిల్ సెల్ రక్తహీనత?!

## (19 జూన్ "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల ఆఫ్రికన్, మెడిటెరేనియన్, మిడిల్ ఈస్ట్, సౌత్ ఆఫ్రికన్, భారత్ లాంటి ఏసియన్ దేశాల అమాయక ప్రజలు, ముఖ్యంగా గిరిజనలు సికిల్ సెల్ వ్యాధితో సతమతమవుతున్నారు. ప్రధాన ప్రజారోగ్య సమస్య పట్ల సరైన అవగాహన, చికిత్స, పరిశోధనలు, వ్యాధిగ్రస్తులకు బాసటగా నిలవడం లాంటివి కల్పించి వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చనే అభిప్రాయాలను వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

### సికిల్ సెల్ వ్యాధి అంటే..!

జన్యుపరమైన ఎర్ర రక్త కణాల రుగ్మతను 'సికిల్ సెల్ వ్యాధి లేదా కొడవలి కణ రక్తహీనత లేదా సికిల్ సెల్ ఎనీమియా' అని పిలుస్తారు. శరీర కణజాలానికి ప్రాణవాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్త కణాలు జన్యు సంబంధ కారణంగా అసాధారణ కొడవలి లేదా సికిల్ ఆకారంలోకి మారడంతో రక్తనాళాలు మూసుకొని పోయి ప్రమాదకర ఆరోగ్య సమస్యలు బయట పడడం చూస్తున్నాం. సికిల్ సెల్ ఉన్న వారిలో ఒక జన్యువు కొడవలి లేదా చంద్రవంక ఆకారంలో, మరొకటి సాధారణ ఆకారంలో ఉన్నట్లయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వీరికి ఎలాంటి అనారోగ్యాలు కలగవు. కాని ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరికీ వివాహం అయినపుడు జన్మించే సంతానంలో రెండు జన్యువులా కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర అనారోగ్య సమస్యలు ప్రారంభమవుతాయి. పుట్టిన పిల్లలకు 5-6 నెలల వరకు ఈ వ్యాధి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగి కొద్ది వ్యాధి లక్షణాలు బయట పడతాయి. సాధారణ రక్తనాళాల జీవితకాలం 120 రోజుల వరకు ఉంటే సికిల్ రక్త కణాల జీవితకాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుంది. సికిల్ ఆకార రక్తకణాలు నశించినంత వేగంగా కొత్త ఎర్ర కణాలు ఉత్పత్తి కాకపోవడంతో వీరికి తీవ్రమైన రక్తహీనత కలిగి కుటుంబాలు చితికి పోవడం గమనిస్తున్నాం. సికిల్ సెల్ క్యారియర్స్ మధ్య వివాహాలు జరుగకుండా జాగ్రత్త పడడం దీనికి సరైన మార్గమని అవగాహన కలిపించడం కనీస అవసరంగా మారింది. సికిల్ సెల్స్ కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించకపోవడం, తగు చికిత్స లేదా మందులు లేకపోవడం వల్ల శరీర కణజాలాలకు ప్రాణవాయువు సరఫరా తగ్గిపోతూ 15 ఏండ్ల లోపు చనిపోవడం జరుగుతోంది.

### ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం-2024 థీమ్:

ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ వ్యాధి తీవ్రతను గుర్తించిన ఐరాస సర్వసభ్య సమావేశం 2008లో తీసుకున్న నిర్ణయం ప్రకారం 2009 నుంచి ప్రతి ఏట 19 జూన్‌న "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటిస్తూ సామాన్య ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ప్రతి ఏట మిలియన్ల ప్రజలు ఈ వ్యాధి బారిన పడడమే కాకుండా లక్షల మంది అకాల మరణాలు పొందడం అనాదిగా జరుగుతోంది. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం-2024 థీమ్‌గా 'పురోగతి ఆశిస్తూ, ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ వ్యాధిగ్రస్థుల చికిత్స, సురక్ష' అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

### సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, చికిత్సలు:

సికిల్ సెల్ వ్యాధి లక్షణాల్లో కాళ్లు/చేతులు/వేళ్లు/ప్లీహం వాపుతో వర్కర్లు తిరగడం, దీర్ఘకాలం కామెర్లు, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు, మైకం, స్ట్రోక్, కీళ్ల నొప్పులు, లెగ్ అల్సర్స్, పల్మనరీ హైపర్‌టెన్షన్, పిత్తాశయ రాళ్ళు, రక్తహీనతతో శరీరం పాలిపోవడం లాంటి ప్రధానమైనవిగా గుర్తించబడినవి. ఈ వ్యాధి నిర్థారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే (పది రూపాయల ఖర్చు మాత్రమే) ఏర్పాట్లు ఉన్నాయి. సికిల్ సెల్ రోగానికి సరైన చికిత్సల లేనందున క్యారియర్లను గుర్తించి వారి మధ్య పెళ్లిళ్లు జరుగకుండా చూడడం, అందుబాటులో ఉన్న మందులతో జీవితకాలాన్ని పెంచడం ఉత్తమ మార్గాలని తెలుస్తున్నది. ఇది ప్రమాదకర అనువంశిక వ్యాధి అయినందున నివారణోపాయాలే ప్రధానమని గమనించాలి. ఒకవేళ క్యారియర్ల మధ్య వివాహాలు జరిగితే వారి సంతానానికి తప్పనిసరిగా వారసత్వంగా వ్యాధిగా సికిల్ సెల్ రక్తహీనత వస్తుంది. కాలేయం, గుండె, మూత్రపిండాలు, పిత్తాశయం, కళ్ళు, ఎముకలు, కీళు ౣ మొదలగు ప్రధాన అవయవాలు కూడా ఈ వ్యాధితో దెబ్బతింటాయి.

సికిల్ సెల్ వ్యాధి కట్టడి చర్యలు:

భారత్‌లో సికిల్ సెల్ వ్యాధి దాదాపు 20 మిలియన్ల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో 18 శాతం వరకు, పశ్చిమ భారతంలో 33 శాతం వరకు, కేంద్ర భారతంలో 44 శాతం వరకు, దక్షిణ భారతంలో 40 శాతం వరకు సికిల్ సెల్ వ్యాధి విస్తరించా ఉంది. ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రాజెక్టులు, పరిశోధనాలయాలు కూడా చేపట్టారు. సికిల్ సెల్ కట్టడికి ప్రజలకు స్కీ?నింగ్‌పరీక్షలు నిర్వహించడం, క్యారియర్ల మధ్య పెళ్లిళ్లు జరుగకుండా అవగాహన కల్పించడం, వ్యాధితో బాధపడుతున్న రోగులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించడం నిరంతరం జరగాలి. టీకాలు వేయించడం, యాంటీబయాటిక్స్, అధిక ద్రవం తీసుకోవడం, నొప్పి మందులు వాడడం, ఎముకల మజ్జ కణాల మార్పిడి, రక్త మార్పిడి లాంటి ఉపశమన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 10 లక్షల గిరిజన జనాభాలో కనీసం 10 శాతం మందికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు, ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు తేలింది.

వ్యాధి ప్రబలిన ప్రదేశాల జనాభా అందరికీ రక్త/మూత్ర పరీక్షలు నిర్వహించడం, ఛాతీ ఎక్స్-రే తీయడం, నొప్పి తగ్గించే పేయిన్ కిల్లర్స్ వాడడం, ఎముకల మజ్జ/రక్త మార్పిడి చేయడం, సికిల్ సెల్ క్యారియర్ల మధ్య వివాహాలు జరుగకుండా నిరోధించడం, వ్యాధి పూర్వాపరాల పట్ల అవగాహన కల్పించడం, చికిత్సల కేంద్రాలను అందుబాటులో ఉంచడం, పరిశోధనలు కొనసాగించడం లాంటి చర్యలను తీసుకుంటూ సికిల్ సెల్ వ్యాధి లేని ప్రపంచాన్ని నిర్మిద్దాం, కొడవలి కణ రుగ్మత బారిన పడిన అమాయక, నిరుపేద గిరిజనులకు బాసటగా నిలుద్దాం.

– డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# చంద్రపవన్‌ల విజన్‌తో ఏపిని అభివృద్ధి చేస్తాం - మంత్రి అనగాని సత్య ప్రసాద్

**–మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పష్టం**
**–ఇప్పటికే పొలవరం పని ప్రారంభించాం**
**–పవన్ చొరవతలో తీర ప్రాంతాలపై దృష్టిపెడతాం**
**–మాజీ మంత్రి జోగి పై విచారణ చేపడతాం**

అమరావతి, జూన్ 18 :సీఎం చంద్రబాబు నాయుడు విజన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచన, ప్రధాని నరేంద్ర మోదీ అండతో రాష్ట్రాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తాం అన్నారు ఏపీ



రెవిన్యూ, రిజిస్ట్రేషన్ , స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.. బాపట్ల జిల్లా రేపల్లెలో నేడు మీడియాతో మాట్లాడుతూ, 2014-2019 మధ్యకాలంలో ఏ విధంగా అభివృద్ధి జరిగిందో అంతకంటే మిన్నగా 2024 నుంచి ఏర్పడిన కొత్త ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని త్వరగా అభివృద్ధి చేస్తాం అన్నారు..

ఇక, నిన్ననే సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును సందర్శించి పూర్తి సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు మంత్రి అనగాని.. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అండతో తీర ప్రాంతమైన రేపల్లెను కూడా అభివృద్ధి చేస్తా అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాకతో రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు.

మరోవైపు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించిన ఆయన.. జగన్‌కు విలాసవంతమైన భవనాల పిచ్చి ఉందని, .. భీమిలి ప్రాంతంలో ఉన్న పర్యాటక కేంద్రాలను కొల్లగొట్టి ఋషికొండను అభివృద్ధి చేశామని చెబుతున్నారన్నారు. ఋషికొండపై ఆ పార్టీ నాయకులకే సరైన అభిప్రాయం లేదన్నారు.. ఋషికొండను ధ్వంసం చేసి ప్రజాధనాన్ని వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రభుత్వ భవనం కట్టాలంటే నియమ నిబంధనలు ఉంటాయని అన్నారు.

జోగిపై విచారణ చేపడతాం..

కృష్ణాజిల్లాలోని అగ్రిగోల్డ్ కు సంబంధించిన భూములను మాజీమంత్రి జోగి రమేష్ వారి కొడుకు బంధువులు భూ హక్కు పత్రాలు మార్చారని అవయోగం వచ్చిందని,.. వాటిపై కూడా పూర్తిగా విచారణ చేపడతాం అన్నారు మంత్రి అనగాని . తప్పులు చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఆయన.. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు వెళ్లదని స్పష్టం చేశారు.. ఇక, అమరావతే ఏకైక రాజధాని.. ఇప్పటికే అమరావతిలో ఎలక్ట్రికల్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

కాగా మంత్రి అయిన తర్వాత తొలిసారిగా తన నియోజకవర్గమైన రేపల్లెకు వచ్చిన సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా రేపల్లే ప్రజలకు, స్థానికి కూటమి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు..

# డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ఏపీని అగ్రగామిగా నిలుపుతాం -మంత్రి సత్యకుమార్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముందే దీపావళి వచ్చిందని.. ఐదేళ్ల రాక్షస పాలనకు స్వస్తి పలికి.. ప్రజలు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి చారిత్రాత్మిక విజయం అందించారని తెలిపారు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్.. మంత్రి హోదాలో ఆయన తొలిసారి శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరానికి వచ్చిన ఆయనకు కార్యకర్తలు నాయకులు భారీ ఎత్తున బైక్ ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు.. భారీ ఎత్తున తరలివచ్చి నియోజవర్గ పరిధిలోకి విచ్చేసిన సత్య కుమార్ యాదవ్ కి అడుగడుగునా నీరాజనాలు పడుతూ పూలమాలలతో సత్కరించుకుంటూ రోడ్డు పొడవునా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం ఆలోచించే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రం తిరోగమనంలో పయనించి.. 20 ఏళ్లు వెనక్కు వెళ్లింది.. అన్ని వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి, సహజ వనరులు దోచుకున్నారని ఆరోపించారు.. గత పాలకులు ఏపీకి అస్తిత్వం లేకుండా చేశారు.. చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతామన్నారు.. చాలా పెద్ద బాధ్యతలు ప్రజలు తమ పై ఉంచారన్నారు.. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ఏపీని అగ్రగామిలో ఉంచుతామని అన్నారు .

# ఉప ముఖ్యమంత్రి పవన్‌కు అమరావతి రైతుల ఘన స్వాగతం..



అమరావతి, జూన్ 18 :డిప్యూటీ సీఎం గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పవన్ కల్యాణ్ నేడు అమరావతికి వచ్చారు.. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు రాజధాని ప్రాంత రైతుల నుంచి ఘన స్వాగతం లభించింది. సీడ్ యాక్సెస్ రోడ్డు వద్దకు వాహనశ్రేణి చేరుకోగానే భారీ గజమాలతో పవన్‌ను సత్కరించారు. వెంకటపాలెం నుంచి మందడం వరకు దారి పొడవునా పూలు చల్లుతూ నీరాజనాలు పలికారు. అనంతరం పవన్ వెలగపూడి సచివాలయం చేరుకోనున్నారు. అక్కడ తనకు కేటాయించిన ఛాంబర్‌ను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఇక . బుధవారం ఆయన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలుతో రూ.2 వేల కోట్లు అదనపు భారం

**- జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్‌కు వివరాలు అందించిన విద్యుత్ అధికారి రఘు**

హైదరాబాద్ జూన్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయడంతో రూ. 2 వేల కోట్లు అదనపు భారం తెలంగాణపై పడిందని విద్యుత్ అధికారి రఘు తెలిపారు. బిఆర్‌ఎకె భవన్‌లో భద్రాద్రి, యదాద్రి విద్యుత్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లపై జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ విచారణ జరుపుతోంది. కమిషన్‌కు విద్యుత్ అధికారి రఘు వివరాలు అందించా రు. కమిషన్ కార్యాలయానికి టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం కూడా వచ్చారు.



ఈ సందర్భంగా రఘు మాట్లాడారు. ఛత్తీసగఢ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయు చేసుకుందని, ఛత్తీసగఢ్ డిస్కంలతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం డిస్కంలు పిపిఎ చేసుకున్నాయని, ఛత్తీసగఢ్‌తో చేసుకున్న పిపిఎలకు ఇంతవరకు ఆమోదం లభించలేదని రఘు పేర్కొన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను నామినేషన్ పద్ధతిలో బిహెచ్ఎల్‌కు అప్పగించారని, కాంపిటేటివ్ బిడ్డింగ్ వెళ్తే ఆలస్యం అవుతుందని, నామినేషన్ పద్ధతిలో బిహెచ్ఇఎల్‌కు ఇచ్చారని, భద్రాద్రి పవర్‌ప్లాంట్‌లో ఇప్పటికే చాలా సమస్యలు వస్తున్నాయని, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో నాణ్యత లేని యంత్రాలు ఉపయోగించారని, భద్రాద్రి పవర్‌ప్లాంట్‌ను గోదావరి ఒడ్డున నిర్మించడంతో గోదావరి వరదలు వచ్చి ప్రతీసారి ప్లాంట్ మునిగిపోతుందన్నారు. సాంకేతిక పరమైన అంశాలు దృష్టిలో పెట్టుకోకుండా భద్రాద్రి పవర్ ప్లాంట్ పెట్టారన్నారు. బొగ్గు గనులకు 280 కిలో మీటర్ల దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని, బొగ్గు గనులకు దూరంగా పెట్టడంతో రవాణా ఛార్జీలు పెరుగుతాయన్నారు.

# మోడీ ప్రభుత్వం మైనార్టీలో ఉందనే ప్రచారం

**-ఎంపీలను కాపాడుకొనే ఎత్తు గడ ..ఆత్మ రక్షణలో కాంగ్రెస్ పార్టీ ...**

న్యూ ఢిల్లీ జూన్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టారు. ఎన్డీయే మిత్రపక్షాలకు 292 మంది ఎంపీల బలం ఉంది. బీజేపీ సొంతంగా 240 మంది ఎంపీలున్నారు. ఎన్నికలకు ముందే బీజేపీ మరికొన్ని పార్టీలతో కలిసి ఎన్డీయే కూటమిగా బరిలోకి దిగింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొంతంగా తమకు 300కు పైగా సీట్లు వస్తాయని బీజేపీ ఆశించింది. కానీ ఫలితం భిన్నంగా వచ్చింది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి రాకపోయినప్పటికీ.. ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. ప్రధానమంత్రిగా మోదీ అభ్యర్థిత్వానికి ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు ఒకే చెప్పాయి. దీంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటుకు సంఖ్యాబలం లేదని.. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం అనైతికమంటూ కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఓ అడుగు ముందుకేసి మోదీ ప్రభుత్వం మైనార్టీలో ఉందని.. ఎప్పుడైనా కూలిపోవచ్చన్నారు. అదే సమయంలో ఈ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవడం లేదంటూ మరో వ్యాఖ్య చేశారు. వాస్తవానికి మోదీ ప్రభుత్వం మైనార్టీలో ఉందా.. తగిన సంఖ్యా బలంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిందా అనే విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. ఎందుకంటే ఎన్నికలకు ముందే ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ముందుకెళ్లడంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సీట్లు కూటమికి వచ్చాయి. దీంతో ఎన్డీయే సర్కార్ ఏర్పడింది. కానీ ఇండియా కూటమి విమర్శల వెనుక అసలు కారణంపై రాజకీయ విశ్లేషకులు పలు రకాల విశ్లేషణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్లు మోదీ ప్రభుత్వం మైనార్టీలో లేదు. టీడీపీ, జేడీయూతో పాటు మరికొన్ని ఎన్డీయే భాగస్వామ్యపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు తమ మద్దతును ఉపసంహరించుకుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న కారణంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఇప్పటికిప్పుడు మద్దతు ఉపసంహరించుకునే అవకాశాలు లేవని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఎన్డీయే కూటమిలో బీజేపీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు 99 మంది ఎంపీలు ఉండగా.. మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ రెబల్ ఎంపీ ఒకరు ఆ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం వందకు చేరింది. అధికారం చేపట్టాలంటే కాంగ్రెస్‌కు మరో 172 మంది ఎంపీల బలం అవసరం. ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీల మద్దతు లేకుండా కాంగ్రెస్ అధికారం చేపట్టడం కష్టం. ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే ఆ పార్టీలో ఇప్పుడున్న భాగస్వామ్య పక్షాలకు కలిపి 233 మంది ఎంపీల బలం ఉంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మరో 39 మంది ఎంపీల మద్దతు అవసరం. టీడీపీ, జేడీయూకు చెందిన ఎంపీల సంఖ్య కలిపినా ఇండియా కూటమి సంఖ్య 261కి చేరుతుంది. ఇంకా 12 మంది ఎంపీల మద్దతు అవసరం. అంటే సుమారు మరో మూడు నుంచి నాలుగు పార్టీలకు చెందిన మద్దతు ఇండియా కూటమికి అవసరం. ఇన్ని పార్టీల కలయికతో ప్రభుత్వం ఏర్పడినా ఎన్నిరోజులు పాలన కొనసాగిస్తుందనే విషయం అనుమానేమనంటున్నారు రాజకీయ పండితులు. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వానికి ప్రస్తుతం వచ్చిన నష్టం ఏమి లేదని.. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి అవసరమైన మెజార్టీ ఉందనే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. మరో ఐదేళ్లు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండే అవకవాశం ఉంది. దీంతో ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలను బీజేపీ ఆకర్షించే అవకాశం ఉందనే అనుమానంతోనే కాంగ్రెస్ నేతలు మోదీ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని.. మైనార్టీలో ఉందనే ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇండియా కూటమిలోని పార్టీలు తమ ఎంపీలు పార్టీ మారకుండా ఉండేందుకు ఈ ప్రచారానికి కాంగ్రెస్ తెరలేపిందనే చర్చ నడుస్తోంది. తమ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు చేజారిపోకుండా ఉండేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందనే ఆశ కల్పించడం ద్వారా పార్టీ నాయకులను కాపాడుకునేందుకు వేసిన ఎత్తుగడగా తెలుస్తోంది. కాంగ్రెస్ తన వ్యూహంతో ఎంపీలను కాపాడుకోగలదా లేదా అనేది భవిష్యత్తులో తేలనుంది.

# ఇక కౌరవ సభ స్థానంలో గౌరవ సభ - నారా భువనేశ్వరి

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం పట్ల సీఎం చంద్రబాబు అర్థాంగి నారా భువనేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. తాను కోరుకున్నట్టుగానే అద్భుతమైన ప్రజా తీర్పుతో ప్రజా పాలన మొదలైందని పేర్కొన్నారు. ప్రజలే సుప్రీం అని చాటి చెప్పిన తిరుగులేని తీర్పుతో ఇక కౌరవ సభ స్థానంలో గౌరవ సభ కొలువుదీదనుందని అన్నారు.. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందన్న పూర్తి నమ్మకం నాకుంది అంటూ ట్విట్ చేశారు.

"నాడు నిజం గెలవాలి కార్యక్రమంలో ప్రజల ఆవేదన చూశాను, బాధలు విన్నాను, ఇబ్బందులు తెలుసుకున్నాను. ఇవాళ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు తామే గెలిచినంత సంతోషంలో ఉన్నారు, స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నారు, తమ అభిప్రాయాలను చెప్పగలుగుతున్నారు. నాడు తమకు జరిగిన అన్యాయాలను నిర్భయంగా ప్రస్తావిస్తూ, తాము అనుభవించిన క్షోభపై గళం విప్పుతున్నారు. నాడు అశాంతితో బతికిన ప్రజల మనసులు నేడు తేలికపడ్డాయి. మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్తుపై ధైర్యంగా ఉన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇది నా మనసుకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇక ప్రజలకు అంతా మంచే జరుగుతుంది.

కూటమి ప్రభుత్వంలో, చంద్రబాబు గారి పాలనలో అమరాతి రాజధానిగా మళ్లీ గర్వంగా నిలబడుతుంది. రాజధాని రైతుల పోరాటాలు ఫలించి వారి జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయి.

# ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ ఫలితాలు విడుదల

అమరావతి, జూన్ 18 :ఏపీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు నేడు విడుదల చేశారు.. ఈ పరీక్షలకు దాదాపు 1.40 లక్షల మంది హాజరయ్యారు. ఏపీలో మే 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్మీడియన్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మూల్యాంకనం పూర్తయిన నేపథ్యంలో, నేడు ఇంటర్ సెకండియర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో జనరల్ కేటగిరీలో 87 శాతం, ఒకేషనల్ కేటగిరీలో 84 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఇక, ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను జూన్ 26న విడుదల చేయనున్నారు.


వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....
VURIMALLA FOUNDATION REGD. NO 228 OF 2019

**జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు - 2024**

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

**కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024**

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

# డ్రగ్స్ తయారి ముఠా గుట్టు రట్టు.. ముగ్గురిని అరెస్ట్




మెదక్, జూన్ 18 :గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా డ్రెస్ తయారు చేస్తున్న ముఠాను తెలంగాణ నార్కోటిక్స్, స్థానిక పోలీసులు గుట్టు రట్టు చేశారు. జిల్లా ఎస్పీ రూపేష్ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయిగుమ్మడిదల గ్రామానికి చెందిన గోస్కొండ అంజిరెడ్డి, కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ గౌడ్, సాయిగౌడ్ మరో వ్యక్తి రాకేష్‌తో కలిసి కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ గౌడ్ భూమిలో ఉన్న డెయిరీ కోళ్ల ఫారం షెడ్డులో గత ఆరు నెలల నుంచి డ్రగ్స్ తయారీ చేస్తున్నారు.

సమాచారం అందుకున్న నార్కోటిక్స్ విభాగం, స్థానిక పోలీసులు జరిపిన స్టింగ్ ఆపరేషన్ లో వీరి నేరం బయటపడిందని జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. ఇక్కడ తయారయ్యే ఆల్ఫాజోమ్ ను హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కస్టడీలో అంజిరెడ్డి, సాయిగౌడ్, రాకేష్ కస్టడీలో ఉన్నారని ప్రభాకర్ గౌడ్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఇక్కడ తయారయ్యే ఆల్ఫాజామ్ డ్రగ్స్ దాదాపు 40 నుంచి 50 లక్షలు, ముడిసరుకు 60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఎవరైనా అనుమానితంగా తమ తమ ప్రాంతాలలో ఇలాంటి చర్యలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ విలేకరుల సమావేశంలో ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చినటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు. అలా సమాచారం ఇవ్వడం వలన త్వరిత గతిన ఇలాంటి వారిని పట్టుకుని వెంటనే చర్యలు తీసుకోవడానికి సులువుగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు లో పాల్గొన్న నార్కోటిక్ విభాగాన్ని స్థానిక పోలీసులను ఎస్పి అభినందించారు.

# ఉద్ధంపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని వివిధ జాతీయ ప్రాజెక్టులతో సహా జమ్ము & కశ్మీర్‌లోని ప్రధాన రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 18 :సుమారు రూ.4000 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మక చత్తర్‌గాలా సొరంగ పనులను భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చేపడుతుందని, కథువా ఎక్స్‌ప్రెస్ నడవా సెక్షన్‌లోని అండర్‌పాస్‌లను ప్రజలు కోరిన చోట త్వరితగతిన చేపడతామని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

జమ్ము కశ్మీర్ లోని పలు ప్రధాన రోడ్డు, సొరంగ ప్రాజెక్టులపై నేడు శ్రీనగర్‌లో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ అధ్యక్షతన దాదాపు నాలుగు గంటలపాటు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, తాను చేసిన సలహాలు, ప్రతిపాదనలను కేంద్రమంత్రి శ్రీ గడ్కరీ అంగీకరించినందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

చత్తర్‌గాలా సొరంగ ప్రతిపాదన ఆరేళ్ల క్రితం ప్రారంభించినదని, డీపీఆర్ ను కూడా బీఆర్ఓ ఏజెన్సీ 'బేకన్స్' తయారు చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా అది సాధ్యం కాలేదని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో, అణుశక్తి విభాగం, అంతరిక్ష శాఖ, ఎంఓఎస్ పర్సనల్, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. లఖన్‌పూర్ నుంచి బసోహ్లీ–బానీ, భదేర్వా–దోడా మధ్య కొత్త జాతీయ రహదారి నిర్మాణాన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఒకవైపు నుంచి నిర్మాణ పనులు సొరంగ ప్రదేశానికి చేరుకోగానే చారిత్రాత్మక చత్తర్‌గాలా సొరంగ నిర్మాణం కూడా చేపడతామని తెలిపారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, "ఈ రహదారి పూర్తయిన తర్వాత, ఇది అద్భుతమైన మార్పుకు నాంది పలుకుతుందని, ఇది పర్యాటక ప్రదేశాలైన బసోహ్లి, బానీ ద్వారా లఖన్‌పూర్, దోడా జిల్లా మధ్య అన్ని కాలాల వాతావరణ అనుసంధానతను కలిగి ఉంటుదన్నారు. అంతేకాకుండా ఈ నిర్మాణాలు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా వ్యాపార, ఉపాధి ఆదాయ ఉత్పత్తికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు.

ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఢిల్లీ–కత్రా ఎక్స్‌ప్రెస్ నడవా గురించి మంత్రి ప్రస్తావిస్తూ, 2015 లో ప్రారంభమైన ఎన్నో ప్రయత్నాల తరువాత ఎక్స్‌ప్రెస్ నడవాకు ఆమోదం లభించిందని తెలిపారు. ఎందుకంటే పంజాబ్ సైతం దిల్లీ–అమృత్ సర్ మధ్య ఇలాంటి ఎక్స్‌ప్రెస్ నడవాను డిమాండ్ చేసినందున ప్రారంభ జాప్యం జరిగిందని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేశారు.

చివరకు అమృత్ సర్– కథువా వద్ద ఆగే స్థలాలను ఏర్పాటు చేస్తూ ఢిల్లీ–కత్రా మధ్య ఎక్స్‌ప్రెస్ నడవా ఏర్పాటుకు రాజీ కుదిరిన తర్వాత ఈ ప్రాజెక్టు ఖరారైందని తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ నడవా చివరి దశలో ఉందని, స్థానిక ప్రజల సౌలభ్యం కోసం హాత్లీ, రాజ్‌బాగ్, చన్ అరోరియన్, చాపర్, కూటా వంటి ప్రాంతాల్లో అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రజల డిమాండ్ ను అంగీకరించడం జరిగిందని తెలిపారు.

అదే నియోజకవర్గంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, "కిష్త్వార్ ఛత్రు లో నిర్మిస్తున్న జాతీయ రహదారి విభాగానికి చెందిన పనులను కూడా వేగవంతం చేస్తామని, ఇది ప్రయాణ సౌలభ్యం కోసం ప్రత్యామ్నాయ రహదారి అనుసంధానాన్ని అందిస్తుంది" అని అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తన లోక్‌సభ నియోజకవర్గానికి ప్రధాన హైవే ప్రాజెక్టులను కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చెనాని–సుధామ దేవ్ జాతీయ రహదారి యొక్క మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను కూడా వేగవంతం చేస్తామని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా తెలిపారు. ఖిలేని మీదుగా గోహాకు వెళ్లే కొత్త జాతీయ రహదారి బెర్గ్వానా, హాంబల్ గ్రామాలతో పాటు తన సొంత గ్రామమైన కలోటాతో జాతీయ రహదారి అనుసంధానం ఉంటుందని తెలిపారు.

కేంద్రమంత్రివర్గంలో జమ్ము కశ్మీర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా, శ్రీనగర్–సోనామార్గ్ విభాగం, జోజిలా టన్నెల్, జమ్ము రాజౌరి రహదారి, శ్రీనగర్, జమ్మూ రెండు రింగ్ రోడ్ల యొక్క కొనసాగుతున్న ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించినందుకు డాక్టర్ జితేంద్ర సింగ్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ని అభినందించారు.

# సైనిక ఉద్యోగులకు మరియు వారి కుటుంబాలకు చికిత్సకోసం స్కిన్ బ్యాంక్ సదుపాయాన్ని ప్రారంభించిన ఆర్మీ హాస్పిటల్ (ఆర్ & ఆర్)

న్యూఢిల్లీ, జూన్ 18 :ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ పరిధి లో మొట్ట మొదటిదైన అత్యాధునిక స్కిన్ బ్యాంక్ సదుపాయాన్ని ప్రారంభిస్తున్నట్లు న్యూ ఢిల్లీ లోని ఆర్మీ హాస్పిటల్ (రిసర్స్ ఒ రెఫరల్) 2024 జూన్ 18 న ఒక ప్రకటించింది. సైనికోద్యోగులు మరియు వారి కుటుంబాల కు అగ్ని వల్ల అయిన తీవ్ర గాయాలు మరియు చర్మ సంబంధి అన్య రోగాల చికిత్స లో విప్లవాత్మకమైన మార్పుల ను తీసుకు రావాలన్నదే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం లక్ష్యం గా ఉంది.

ఈ క్రొత్త స్కిన్ బ్యాంక్ స్కిన్ గ్రాఫ్ట్ ల సేకరణ, శుద్ధి, నిలవ మరియు పంపిణిలకు ఒక కేంద్రీకృత నిలయం వలె పనిచేస్తుంది. ఇది దేశం అతటా సైనిక వైద్య చికిత్స కేంద్రాల కోసం ఒక ముఖ్య వనరు ను సమకూర్చుతుంది.

ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, సాయుధ బలగాల సిబ్బంది కి మరియు వారి కుటుంబాల కు అన్నిటి కంటె ఉన్నతమైన చర్మ మార్పిడి సంబంధి చికిత్స ను అందుబాటు లోకి తీసుకు రావడానికి పూచీ పడాలి అని సాయుధ దళాలు భావించాయి.

ఈ స్కిన్ బ్యాంకు లో ప్లాస్టిక్ సర్జన్ లు, టిష్యూ ఇంజినీర్ లు, ఇంకా విశేష సాంకేతిక నిపుణులు సహా ఉన్నత శిక్షణ ను పొందిన వైద్య వృత్తి నిపుణుల జట్టు పనిచేస్తుంది. ఈ కేంద్రం నాణ్యత నియంత్రణ మరియు సురక్ష ల తాలూకు అత్యున్నత ప్రమాణాల కు కట్టుబడి పని చేస్తుంది. దీని ద్వారా స్కిన్ గ్రాఫ్ట్ విషయం లో పటిష్టత పరమైనటువంటి, విశ్వసనీయత పరమైనటువంటి పూచీ లభిస్తుంది.

డిజిఎమ్ఎస్ (ఆర్మీ) మరియు కర్నల్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ శ్రీ అరిందమ్ చటర్జీ మాట్లాడుతూ, ఈ స్కిన్ బ్యాంకు యొక్క ప్రారంభం సైనికోద్యోగుల ఆరోగ్యం మరియు శ్రేయస్సు ల పట్ల అచంచలమైనటువంటి నిబద్ధత కు ఒక నిదర్శన గా ఉందన్నారు. ఈ కేంద్రం సంరక్షణ పరం గా నాణ్యత ను వృద్ధి చెందింప చేయడం ఒక్కటే కాకుండా తీవ్రమైన గాయాల బారిన పడ్డ వ్యక్తుల కు తగిన సహాయాన్ని అందించే సామర్థ్యం సైతం బలపడుతుందని ఆయన అన్నారు.

"చర్మ కణజాలాని కి సంబంధించిన ఒక విశిష్టమైన వనరుల ను కలిగి ఉండడం తో మేము మా రోగుల కు అత్యంత ప్రభావవంతం అయినటువంటి మరియు వ్యక్తిపరమైనటువంటి చికిత్సల ను అందించగలుగుతాం, దీని ద్వారా అంతిమం గా వారు పునఃస్వస్థులు అయ్యే అవకాశాలలోను, పునరాశ్రయాన్ని పొందే అవకాశాలలోను మెరుగుదల సాధ్యపడుతుంది" అని ఆర్మీ హాస్పిటల్ (ఆర్ ఒ ఆర్) కమాండంట్ లెఫ్టినెంట్ జనరల్ శ్రీ అజీత్ నీలకంఠన్ అన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు హెచ్చరిక.. డ్యూటీకి రాకుండా మస్టర్ పడితే వేటే

-అటెండెన్స్ పద్దాక ఆఫీసు దాటితే ఉపేక్షించేది లేదు
-క్రమశిక్షణ, సమయ పాలన పాటించని ఉద్యోగులు, అధికారులపై కఠిన చర్యలు
-భూగర్భ గనుల్లో అధికారులు రోజూ పని ప్రదేశాలు తనిఖీ చేయాలి
-కంపెనీ మనుగడ సాగాలంటే పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిందే
-సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టీకరణ

హైదరాబాద్, జూన్ 18 :సింగరేణిలో ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించిన సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్ బలరామ్ ఇప్పుడు కంపెనీలో పని సంస్కృతిని పెంచేందుకు కీలక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారుల సమయ పాలనపై ప్రత్యేక దృష్టి సారించారు. గనులు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు డ్యూటీలకు రాకున్నా కూడా మస్టర్ పడుతున్నట్లు.. మరి కొందరు మస్టర్ పడి బయటకు వెళ్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందించారు. అలాగే భూగర్భ గనుల్లో పని ప్రదేశాలను సంబంధిత అధికారులు రోజూ తనిఖీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

సింగరేణిలో ఉద్యోగులు, అధికారులంతా కూడా ఇకపై రోజూ తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేసుకోవాలని.. దీనిపై ఆయా ఏరియా జీఎంలు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భోజన విరామం పూర్తయిన తర్వాత నిర్ణీత సమయంలో మళ్లీ సీట్లలో కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లంచ్ బ్రేక్‌లో చాలా మంది మూడు గంటల పాటు విరామం తీసుకోవడం ద్వారా తమ పనులు/ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పలువురు సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన సెక్యూరిటీ విభాగం ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు.

గతంలో సింగరేణి ఆస్పత్రులలో, డిస్పెన్సరీలలో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు రాకపోతే మెమోలు జారీ చేసిన ఆయన ఇప్పుడు సమయ పాలనను పాటించని వారిపైనా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

సింగరేణిలోని ప్రతి ఉద్యోగి, అధికారి కచ్చితమైన సమయపాలన పాటించాలని, డ్యూటీలో చేరిన తర్వాత బయటకు వెళ్ళటం గాని, పని చేయకుండా కూర్చోవడం గాని చేయకూడదన్నారు. ఈ విషయంలో ఎంతటి పెద్ద వారైనా, పలుకుబడి ఉన్నవారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు ఎనిమిది గంటలు పనిచేస్తున్నారని.. వారికి సంబంధించిన సంక్షేమం, ఇతరత్రా పనులను నిర్వర్తించే ఉద్యోగులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులలో కొందరు ఏదో ఒక కారణం చూపి , తాము పనిచేసే కార్యాలయాలను వదిలి వరండాల్లో తిరగడం, బయటికి వెళ్లడం, కబుర్లతో కాలక్షేపం చేస్తే సంబంధిత విభాగాధిపతులపై చర్యలు ఉంటాయన్నారు. దీనిపై నిఘా విభాగం నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోకి అడుగులు పెడుతోందని.. కంపెనీ ఉత్పాదకత పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని.. ఇందులో ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం అత్యవసరవన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ రంగంతో పోటీ పడుతున్న మన సంస్థ మనుగడ సాగాలంటే పని గంటలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఒక క్రమశిక్షణ గల సంస్థగా సింగరేణిని రూపుదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కువ మంది కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సంస్థ పట్ల అభిమానంతో, వేరెవరో చెప్పే అవసరం లేకుండానే తమకు ఇచ్చిన పనిని అంకిత భావంతో పూర్తి చేస్తున్నారని, డ్యూటీ సమయం మొత్తం పని చేస్తున్నారని, అటువంటి వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కానీ కొందరు విధులకు గైర్హాజరవుతూ, మస్టర్ పడికూడ బయటకు వెళ్లడం లేదా డ్యూటీలో ఉండి కూడా పనిచేయకుండా ఉంటున్నారని, ఇలాంటి వారి వల్ల ఇతరులు కూడా పాడైపోయే అవకాశం ఉందనీ హెచ్చరించారు. పని సంస్కృతిని దెబ్బతీస్తే యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంటుందని.. అవసరమైతే క్రమశిక్షణ లేని ఉద్యోగులను విధుల నుంచి తొలగించడానికి వెనకాడబోమన్నారు.

# దేశంలోని 40 విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు..

న్యూఢిల్లీ, జూన్ 18 :దేశంలో మరోసారి బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ కలకలం సృష్టించాయి. బీహార్‌లోని పాట్నా విమానాశ్రయ అధికారులకు బాంబు బెదిరింపు ఈ–మెయిల్‌లు అందడంతో మంగళవారం ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో భయాందోళన నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 1:10 గంటలకు పాట్నా విమానాశ్రయం డైరెక్టర్‌కు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. దీంతో ఎయిర్ పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పాట్నా ఎయిర్ పోర్ట్ డైరక్టర్ తెలిపారు.

కాగా మంగళవారం ఇది రెండో బాంబు బెదిరింపు. అంతకుముందు గుజరాత్‌లోని వడోదరా విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. విమానాశ్రయ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. పోలీసులను సంప్రదించి విమానాశ్రయ ఆవరణలో భద్రతను పెంచారు. బెదిరింపు ఈమెయిల్‌ను పంపిన వ్యక్తిని ట్రాక్ చేయడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

బూటకపు బాంబు బెదిరింపు చెన్నై నుంచి దుబాయ్ వెళ్లే విమానం ఆలస్యానికి కారణమైంది. ఈ విమానంలో 268 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు రావడంతో భద్రతా సంస్థలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఇదిలా ఉండగా సోమవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న విమానానికి మరో బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 17 ఉదయం 9:35 గంటలకు, ఢిల్లీ–దుబాయ్ ఫ్లైట్‌లో బాంబు ఉందని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఆఫీసు, ఎఉఎ ఎయిర్‌పోర్ట్‌కు ఈమెయిల్ వచ్చిందని పోలీసులు తెలిపారు.

# రాజ్‌నాథ్ నివాసంలో మంత్రుల భేటీ : లోక్‌సభ స్పీకర్ పదవిపై సంప్రదింపులు

న్యూఢిల్లీ, జూన్ 18 : పార్లమెంట్ సమావేశాల ముందు తదుపరి లోక్‌సభ స్పీకర్ పదవిపై ఉత్కంఠ నెలకొంది. ఈ అంశంపై చర్చించేందుకు మంగళవారం సాయంత్రం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో మంత్రుల సమాదవేశం జరగనుంది. జూన్ 24న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక కోసం లోక్‌సభ సమావేశాలు జరగనుండగా అంతకుముందు జరుగుతున్న ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

స్పీకర్ ఎన్నికతో పాటు పార్లమెంట్ సమావేశాల్లో ఎన్డీయే పక్షాల మధ్య మెరుగైన సమన్వయం సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా ఈ భేటీలో పలు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. లోక్‌సభ స్పీకర్ పదవిని ఎన్డీయే కీలక భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీ(యూ) ఆశిస్తున్నాయి. లోక్‌సభ స్పీకర్‌గా ఎవరివైపు ఎన్డీయే మొగ్గుచూపుతుందనే విషయంలో ఈ సమావేశం అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

స్పీకర్ పదవిపై ఎన్డీయే పక్షాలతో పాటు విపక్షాల నుంచి ఏకాభిప్రాయాన్ని సాధించే బాధ్యతను బీజేపీ అగ్రనాయకత్వం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు అప్పగించింది. జూన్ 26న స్పీకర్ ఎన్నిక జరగనుండటంతో ఆనవాయితీ ప్రకారం తమకు డిప్యూటీ స్పీకర్‌ను కేటాయించని పక్షంలో స్పీకర్ పదవికి అభ్యర్ధిని నిలిపేందుకు విపక్ష ఇండియా కూటమి సంసిద్ధమైందని చెబుతున్నారు. ఇక బీజేపీ ఎంపీ ఓం బిర్లా ప్రస్తుతం లోక్‌సభ స్పీకర్‌గా వ్యవహరిస్తున్నారు.

# చంద్రబాబు తప్పిదం వల్లే పోలవరం ఆలస్యం -మాజీ మంత్రి అంబటి ఆరోపణ

అమరావతి, జూన్ 18 : చంద్రబాబు అనాలోచిత నిర్ణయం వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ల

చంద్రబాబు సోమవారం పోలవరాన్ని సందర్శించి ఆ ప్రాజెక్ట్ పూర్తికాకపోవడానికి జగన్‌రెడ్డి ప్రభుత్వం కారణమని చేసిన ఆరోపణలపై అంబటి స్పందించారు.

2018నాటి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం పోలవరంలోని కాపర్‌డ్యాంలు, డయాఫ్రమ్ వాల్, నది డైవర్షన్ పనులు ఒకేసారి ప్రారంభించారని విమర్శించారు. వాస్తవానికి కాపర్ డ్యాం లు పూర్తి చేసి నదిని డైవర్షన్‌ను చేసిన పిదప డయాఫ్రమ్ వాల్ నిర్మిచాల్సిందని , అలా కాకుండా ఒకేసారి చేపట్టడం వల్ల ఏ పనులు కూడా పూర్తికాలేదని గుర్తు చేశారు.

వైసీపీ పాలనలో ప్రాజెక్టులను చిత్తశుద్ధితో పూర్తి చేయడానికి శాయశక్తులా కృషి చేశామని వెల్లడించారు. విమర్శలు పక్కనపెట్టి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో కూడా పోలవరం పూర్తికాదని చంద్రబాబు పరోక్షంగా అంగీకరించారని గుర్తు చేశారు.

# 70 అడుగుల ఖైరతాబాద్ గణేశుడు.. నేత్రపర్వంగా కర్ర పూజ

-ఖైరతాబాద్ గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 70 ఏండ్లు
-అన్ని అడుగుల్లోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం
-సంయుక్తంగా ఉత్సవాల నిర్వహణకు సభ్యుల సమ్మతం
-త్వరలో నూతన కమిటీ ఏర్పాటు: ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్, జూన్ 18 :ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం ఈ ఏడాది 70 అడుగుల్లో రూపుదిద్దుకోనున్నది. ఈ నేపథ్యంలో



నిర్జల్ ఏకాదశి తిథిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం కర్రపూజ మహోత్సవాన్ని వినాయక విగ్రహ ఏర్పాటు మండపం వద్ద వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్ వేడుకలను ప్రారంభించారు. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తైన మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకటించారు. త్వరలోనే నమూనా విడుదల చేస్తామన్నారు. వినాయక చవితికి వారం రోజుల ముందే స్వామి వారి విగ్రహం సిద్ధమవుతుందన్నారు. కర్ర పూజలో పాటు గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన తామే నిర్వహిస్తామంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీలు వేర్వేరుగా ప్రకటించాయి.

దీంతో సభ్యుల మధ్య కొత్త వివాదానికి తెరలేపింది. అయితే సోమవారం జరిగిన కర్రపూజ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇరు వర్గాలతో చర్చించి.. సభ్యులందరూ సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు సభ్యులందరూ అంగీకరించగా, ఎలాంటి గొడవకు తావు లేకుండా కర్రపూజ సజావుగా సాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ్ నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. ప్రస్తుతం అడ్‌హాక్ కమిటీగా కార్యక్రమాలను నిర్వహిస్తామని, రెండు మూడు రోజుల్లో సభ్యులందరితో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సారి గణపతిని దర్శించుకునేందుకు వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదాన్ని అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

1954లో ఒక్క అడుగుతో..

ఖైరతాబాద్ గణేశుడికి 70 ఏండ్ల చరిత్ర ఉన్నది. 1954లో ఒక్క అడుగుతో ప్రారంభించి.. సుమారు 60 అడుగులకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టగా, గణేశుడిని 70 అడుగుల్లో ప్రతిష్ఠించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఖైరతాబాద్ గణేశుడి చరిత్రలో మొదటి సారిగా 70 అడుగుల విగ్రహానికి అంకురార్పణ జరిగింది. పీవోపీ వినియోగించకుండా పూర్తిగా మట్టితో తయారు చేసిన ప్రతిమను ప్రతిష్ఠిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితీ కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు, కోశాధికారి శశిధర్, డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సింగరి రాజ్ కుమార్, సందీప్ రాజ్, మహేశ్ యాదవ్, మహేందర్ బాబు, జి. కృష్ణా యాదవ్, మధుకర్ యాదవ్, వి. ప్రవీణ్, పృథ్వీరాజ్, నాగేశ్, రాంరెడ్డి, అశోక్, రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అయిదేళ్లు గడువుంది-అప్పుడే మీ గోలేంటి.. బీఆర్ఎస్ నేతలపై విరుచుకపడ్డ జీవన్ రెడ్డి


-విద్యుత్ స్కామ్ లో కెసిఆర్ జైలు కెళ్లడం ఖాయం
-హరీశ్ వల్లే తెలంగాణ దివాళా
-ఖజనాలో పైసా లేకుండా చేసిన మీరు
-హామీలను వెంటనే అమలచేయమని అడగడమా?

హైదరాబాద్, జూన్ 18 :తాము ఇచ్చిన హామీల అమలుకు ఐదేళ్ల గడువు ఉందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలు బయటకీ వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఈ విద్యుత్ స్కామ్ ను డైవర్ట్ చేసే పనిలో పడ్డారన్నారు. పైసా పెట్టుబడి లేకుండా విద్యుత్ అందించే ప్రక్రియ కేంద్రం చేస్తే దాన్ని కాదని కేసీఆర్ యాదాద్రి పవర్ ప్లాంట్ మొదలుపెట్టారన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూడు రూపాయలకు యూనిట్ వచ్చే కరెంట్ వదిలి.. 6 రూపాయలకు కొంటారా..? అని ప్రశ్నించారు. కమీషన్ల కక్కుర్తి కోసమే పవర్ ప్లాంట్ అని మండిపడ్డారు. నామినేషన్ మీద యాదాద్రి పనులు ఎందుకు అప్పగించారు.. అని అడిగారు. విద్యుత్ ప్రాజెక్ట్ ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ఎందుకు పిలవలేదని కేసిఆర్ ను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. ఇక . హరీష్ రావు.. అవినీతి చర్చ పక్క దారి పట్టించే పనిలో ఉన్నారన్నారు. విద్యుత్ కొనుగోళ్ల అవినీతి కేసీఆర్ మెడకు చుట్టుకోబోతుందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు వల్లనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళ తీసిందని మండిపడ్డారు. ఆర్థిక శాఖ లూటీ చేసింది మీరే కదా అంటూ హరీష్ రావుపై మండిపడ్డారు. మీరూ లూటీ చేసి ఇప్పుడు మీరు ఎట్లా చేస్తారో చేయండి అన్నట్టు ఉంది హరీష్ వ్యవ హారం అని నిప్పులు చెరిగారు. ఆర్థిక స్థితి గతులు చక్కబెట్టే పనిలో ఉన్నారు సీఎం అన్నారు. తాము ఇచ్చిన హామీల అమలుకు ఐదేళ్ల గడువు ఉందని క్లారిటీ ఇచ్చారు? హామీలు అమలనకు ఇంకా సమయం ఉన్నా బిఆర్ ఎస్ నేతలు హామీలు అమలు చేయలేదంటూ రంకెలేయడం తగదన్నారు జీవన్ రెడ్డి .


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

హైదరాబాద్



ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి అమృతోత్సవ సందర్భంగా

డా॥ ఎన్. గోపి రచించిన 75 కవితల సంపుటి

'రేపటి మైదానం' ఆవిష్కరణ - అంకితోత్సవం

తేది: మంగళవారం 25 జూన్, 2024, సాయంత్రం 6 గంటలకు

తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆడిటోరియం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ కె. శ్రీనివాస్, ఎడిటర్, ఆంధ్రజ్యోతి

సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త

కృతి స్వీకర్త : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, సుప్రసిద్ధ విమర్శకులు

విశిష్ట అతిథులు : ఆచార్య సూర్యా ధనంజయ, పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ కవి, పరిశోధకులు
డా॥ ఎస్. రఘు, ప్రముఖ విమర్శకుడు, కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

గౌరవ అతిథులు : శ్రీ వంగల హర్షవర్ధన్, ప్రముఖ రచయిత, పూర్వ జాయింట్ కమీషనర్ (సి.టి.)
డా॥ ఎస్. జతిన్ కుమార్, ప్రముఖ రచయిత, ఆర్థోపెడిక్స్ సర్జన్

ఆత్మీయ అతిథి : శ్రీ కుడికాల వంశీధర్, ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

గ్రంథ సమాలోచనం : శ్రీ పుప్పాల శ్రీరామ్, ప్రముఖ కవి, విమర్శకులు

సభానిర్వహణ : డా॥ జె. నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, సిటీ కళాశాల

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు

మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన అధికారులు



రాజన్న సిరిసిల్ల, జూన్ 18 :(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝా ను మంగళవారం పలువురు అధికారులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారుల సంఘం (డోర్స్) తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్(టీఎన్జీవోస్), తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రేసా) అధ్యక్షులు, సభ్యులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు కలెక్టర్ కు పుష్పగుచ్చాలు అందజేశారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన నూతన కలెక్టర్




రాజన్న సిరిసిల్ల, జూన్ 18 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి రాగా, కలెక్టర్ కలిసి పూల మొక్క అందజేశారు.

# మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ




రాజన్న సిరిసిల్ల, జూన్ 18 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో అనారోగ్యంతో మరణించిన గుడిసె పెద్ద భూమయ్య భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మంగళవారం నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట గుడిసె పురుషోత్తం,మెట్ట దేవానంద్,గుడిసె సాగర్,గుడిసె మనోజ్,గుడిసె సదానందం,నల్ల సతీష్ రెడ్డి,బండ మహేందర్,గుడిసె అనిల్ తదితరులు ఉన్నారు.

# కేంద్రమంత్రి సోమన్నకు స్వాగతం పలికిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇతర నేతలు..



కరీంనగర్, జూన్ 18 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రోజున జరిగిన కిసాన్ సమ్మేళన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర జల, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ఘన స్వాగతం పలికారు. కేంద్రమంత్రి కి స్వాగతం పలికిన వారిలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, సంపత్ రావు, పుప్పాల రఘు , మల్లేశం , కుమార్ లతోపాటు హుజరాబాద్ నియోజకవర్గ నేతలు, కరీంనగర్ జిల్లా రాష్ట్ర, జిల్లా బాధ్యులు ఉన్నారు.

# మత్తులో ద్విచక్ర వాహనదారులు.. ఒకేరోజు 253 మంది పట్టివేత

హైదరాబాద్, జూన్ 18 :నగరంలో ద్విచక్రవాహనదారులు మత్తులో తూగుతున్నారు. మత్తులో తూలుతున్న వీరు ఏ డివైడర్‌నో, ఏ బ్రిడ్జినో ఢీకొట్టడం.. లేదా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ప్రమాదాల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపే వారే కాకుండా, వారి కారణంగా ఏ పొరపాటు లేని ఇతర వాహనదారులు, పాదచారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డ్రంక్ అండ్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. అయితే, ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు పెట్టినా, జైలు శిక్షలు వేసినా కూడా మందుబాబుల ప్రవర్తనలో మాత్రం ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు.

ప్రతి రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మరణాలు డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగానే జరుగుతున్నాయి. దీనిపై అటు పోలీసులు, ఇటు సామాజిక వేత్తలు ఎంత ప్రచారం చేసినా, అవగాహన కల్పించినా ఫలితం లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 15న ఒకే రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు.. ఎనిమిదిన్నర గంటల్లో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొత్తం 349 మంది పట్టుపడ్డారు. అందులో 253 మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. అయితే, పట్టుబడిన వారిలో 21- 30ఏండ్ల వయస్సు వారే అధికంగా ఉన్నారని, ఆ తరువాత స్థానంలో 31-40ఏండ్ల వయస్సు వారు ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ వెల్లడించారు.

# నేడు ఖమ్మం,పాలేరు నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం, జూన్ 18 :(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఖమ్మం రాపర్తి నగర్ బైపాస్ రోడ్ లోని ఉషాహరి కన్వెన్షన్ హాల్లో జరిగే టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మూడవ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం పర్యటనలో భాగంగా జీళ్ళచెర్వు, కేశవాపురం, ధర్మ తండా, పోచారం, కిష్టాపురం, పాలేరు, ఎర్రగడ్డ తండా, నర్సింహులగూడెం, సంధ్య తండా, లాల్ సింగ్ తండా, గైగొళ్లపల్లి, చౌటపల్లి, బోడియా తండా గ్రామలను సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# ఆర్టిజన్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## -22 వేల మంది విద్యుత్ కార్మికుల సమస్యలపై గళమెత్తిన రాణి రుద్రమ

హైదరాబాద్ జూన్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆర్టిజన్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేసారు.మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కఠిన వైఖరితో మసకబారిన ఆర్టిజన్ల జీవితాలుఅంధకారంలో మగ్గిపోతున్న 22 వేల మంది విద్యుత్ కార్మికుల కుటుంబాలు.ఉద్యమిస్తే.. ఉప్పు పాతరేసంటూ కార్మికులను కేసీఆర్ సర్కారు వంచించినదని దుయ్యబట్టారు.ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని.. ఆశలు పెట్టి నెరవేర్చ లేదన్నారు.గవర్నమెంట్ బెనిఫిట్స్ కు నోచుకోక కార్మికుల తిప్పలువిద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేసారు..తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యుత్ శాఖలో పవర్ ప్లాంటుల నిర్మాణం దగ్గర నుంచి ఉద్యోగుల నియామకం, విద్యుత్ కొనుగోలులో అవకతవలు, అవినీతిపై విచారణ కొనసాగుతోంది.విద్యుత్ శాఖలో జరిగిన అవినీతిపై విచారణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి జ్యుడిషియల్ కమిషన్ ను ఏర్పాటు చేసిందని,. విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అసలు టెండర్లు పిలవకుండా ఒప్పందం చేసుకుని, ఆర్థిక వనరులను దెబ్బతీసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన విషయాలపై జస్టిస్ నరసింహారెడ్డి జ్యుడిషియల్ కమిషన్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్న విషయాన్ని ఈ సందర్భంగా రుద్రమ గుర్తు చేసారు..విద్యుత్ శాఖలో ఆర్థికపరమైన అంశాలు నాణేనికి ఒకవైపు అయితే, విద్యుత్ ఉద్యోగుల భవిష్యత్ మరోవైపుగా ఉంది.తెలంగాణ రైతులు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే విద్యుత్ ఉద్యోగుల జీవితాలు చీకట్లో మగ్గుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 22వేల మంది విద్యుత్ శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నామని చెప్పి ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చి ఆర్టిజన్లుగా గుర్తించి, వారి జీవితాలను త్రిశంకు స్వర్గంలో పెట్టిందాని విమర్శించారు..తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సమయంలో సకల జనులు చేయిచేయి కలిపి కదంతొక్కి ఎలాంటి భాగస్వామ్యమయ్యారు.విద్యుత్ శాఖలో కొంతమంది ఉద్యోగులు ట్రాన్స్ ఫార్మర్లు ఎక్కి ఆత్మహత్యలు చేసుకున్నవారు. తెలంగాణ రాష్ట్రమొస్తే నిరుద్యోగి అనే మాట వినపడదు అని గత ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు.స్వరాష్ట్రం ఏర్పడితే ఒక్కపూటలో సర్వీస్ రూల్స్ మార్చి ఉద్యోగుల భవిష్యత్తును బ్రహ్మాండంగా తీర్చిదిద్దుతామని కేసీఆర్ మాటలు చెప్పిన్రు.తెలంగాణ రాష్ట్రమొచ్చినంక నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయలేదు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగంలోని 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సబ్ స్టాండర్డ్ రూల్స్ తీసుకొచ్చి ఆర్టిజన్లుగా గుర్తించింది. కాని నేడు ఆర్టిజన్ల పరిస్థితి దారుణంగా తయారైందని రాణి రుద్రమ ఆవేదన వ్యక్తం చేసారు. అనేక సమస్యలతో నెత్తినోరు కొట్టుకుంటున్నరు.22 వేల మంది విద్యుత్ కార్మికులు.. ప్రైవేటు ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు భిన్నంగా ఏ బెనిఫిట్స్ వర్తించకుండా త్రిశంకుస్వర్గంలోకి నెట్టివేయబడ్డారు.22 వేల మంది విద్యుత్ ఉద్యోగులను.. ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగా పే-స్కేల్, ప్రమోషన్లు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్, పెన్షన్లు ఏవీ వర్తించడం లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ కార్మికుల సమస్యలను గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు..విద్యుత్ శాఖలో జరిగిన అవకతవకలు, అవినీతిపరులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం , గత ప్రభుత్వం వల్ల నష్టపోయిన డబ్బును రికవరీచేయడం ఎంత ముఖ్యమో విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం అంతే ముఖ్యం.22 వేల మంది విద్యుత్ కార్మికుల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని, విద్యుత్ శాఖ మంత్రిని డిమాండ్ చేసారు.. గత రెండేళ్ల క్రితం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా చేసిన 200 మంది ఆర్టిజన్లను విధుల నుంచి టర్మినేట్ చేసి, తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఉద్యోగులపై కొరడా ఝులిపిస్తామంటూ చెట్టుకొకరు, పుట్టకొకరుగా బదిలీ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బాధిత 200 మంది విద్యుత్ ఉద్యోగులను స్వస్థలాల్లో ఉద్యోగాలు చేసుకునేలా బదిలీ చేయాలని డిమాండ్ చేసారు..రేవంత్ ప్రభుత్వం 22 వేల మంది విద్యుత్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# విజయవాడలో అనితకు క్యాంప్ ఆఫీస్

అమరావతి, జూన్ 18 :విజయవాడలోని కొత్త ఇంట్లోకి హోం మంత్రి వంగలపూడి అనిత గృహ ప్రవేశం చేశారు.

కొత్త ఆటోనగర్లోని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్కు చెందిన నాలుగు అంతస్తుల భవనాన్నే.. ఇకపై హోంమంత్రి తమ నివాసంగా నిర్ణయించుకున్నారు. ఆమె కుమార్తెతో కలిసి పూజాకార్యక్రమాలు నిర్వహించి గృహ ప్రవేశం చేశారు. ఇకపై హోంమంత్రి క్యాంప్ ఆఫీస్గానూ, నివాసంగానూ కూడా ఇదే భవనంని ఆమె వినియోగించనున్నారు.

# తిరుమల భక్తులకు గుడ్‌న్యూస్.. ఇక నడక సులభం

అమరావతి, జూన్ 18 : టీటీడీ ఈవో గా బాధ్యతలు తీసుకున్న శ్యామలరావు తన పనితనాన్ని వేగిరం చేశారు. తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. తిరుమలలో ఎండతీవ్రత ఎక్కువ గా ఉన్న సమయంలో కాలనడకన వచ్చే భక్తులు అనేక ఇబ్బందులు పడే వారు. దీంతో ఈ సమస్యను గమనించిన ఈవో మంగళవారం తిరుమలలో అవసరమైన అన్ని పాయింట్ల వద్ద కూలెంట్ పెయింటలు వేయించారు.

గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం జరిగిన ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశంలో భక్తుల దృష్ట్యా వైట్ కూలెంట్ పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో మంగళవారం ఆ పనులు చేపట్టారు. ప్రధాన ఆలయం, బేడి ఆంజనేయ స్వామి ఆలయం, వాహన మండపం, రాంభగీచ తదితర భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే నాలుగు మాడ వీధుల్లో తెల్లటి శీతలకరణి రంగులు వేశారు. దీంతో తిరుమల దర్శనానికి వచ్చి పోయే భక్తులు సులభంగా నడిచివెళ్లేందుకు వీలుగా ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

# ఈవీఎంలను నిషేధించాల్సిందే.. బ్యాలెట్ ఓటింగే నిర్వహించాలి : సీపీఐ నారాయణ

హైదరాబాద్, జూన్ 18 :: ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలను నిర్వహించాలని సీపీఐ నారాయణ డిమాండ్ చేశారు. ప్రపంచంలో 122 దేశాల్లో ఈవీఎంలను వినియోగించడం లేదు.. ఆ దేశాల్లో బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈవీఎంలను బ్యాన్ చేశారని గుర్తు చేశారు.

అమెరికా, జపాన్ లాంటి దేశాలు బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. మన దేశంలోనే ఈవీఎంలతో ఎన్నికలు ఎందుకు నిర్వహిస్తున్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దేశ వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలి. వచ్చే ఎన్నికలను ఈవీఎంల ద్వారా నిర్వహించొద్దు. ఇది ప్రజల డిమాండ్. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా చర్చలు జరపాలి. ఈవీఎంలను బ్యాన్ చేయాలి. ఈవీఎంలను నిషేధించకపోతే.. తప్పును ప్రోత్సహించినట్లు అవుతుందని నారాయణ పేర్కొన్నారు.

# విశాఖను గంజాయి రాజధానిగా మార్చిన ఘనత వైసీపీదే : పల్లా శ్రీనివాస రావు మండిపాటు

అమరావతి, జూన్ 18 :ఆంధ్రప్రదేశ్ రాజధానిగా విశాఖను మారుస్తామంటూ గంజాయి రాజధానిగా మార్చిన ఘనత వైసీపీకి దక్కుతుందని టీడీపీ ఏపీ నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ఆరోపించారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ రాజధానిగా చేస్తామంటూ ప్రజలను ఆశల పల్లకిలో కూర్చొబెట్టి దందాలకు పాల్పడి మోసగించారని ఆరోపించారు. భూ దోపిడీలకు పాల్పడ్డారని విమర్శించారు.

చంద్రబాబు నాయకత్వంలో విశాఖను ఆర్థిక రాజధానిగా మారబోతుందని పేర్కొన్నారు. 30లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన పోలవరాన్ని రాజధాని అమరావతిని ఎట్టి పరిస్థితుల్లో ఐదేండ్లలో పూర్తి చేస్తామని ధీమాను వ్యక్తం చేశారు.

రాజకీయంగా టీడీపీ శ్రేణులపై పెట్టిన కక్షపూరిత కేసులను వందరోజుల్లో మాఫీ చేయిస్తామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ఏర్పాటును ప్రజలంతా హర్షిస్తున్నారని ఆయన అన్నారు. అంతకు ముందు విశాఖ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలవ౯ాలలు వేసి నివాళి అర్పించారు.

# ధనలక్ష్మి బ్యాంకు ఎండీగా కేకే అజిత్ కుమార్..!

హైదరాబాద్, జూన్ 18 : ప్రైవేట్ బ్యాంక్ ధనలక్ష్మి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా కేకే అజిత్ కుమార్ నియమితులయ్యారు. ఈ నెల 20న ఎండీగా అజిత్ కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని కేరళ కేంద్రంగా పని చేస్తున్న ధనలక్ష్మి బ్యాంకు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది. బ్యాంక్ ఎండీ కం సీఈఓగా అజిత్ కుమార్ నియామకానికి బ్యాంకు బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. జూన్ 20 నుంచి మూడేండ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. కంపెనీల చట్టం-2013, సెబీ నిబంధనలకు అనుగుణంగా అజిత్ కుమార్ నియామకానికి వాటాదారుల ఆమోదం లభించాల్సి ఉందని ధనలక్ష్మి బ్యాంకు పేర్కొంది. అజిత్ కుమార్‌కు బ్యాంకింగ్ రంగంలో 36 ఏండ్ల అనుభవం ఉంది. ఫెడరల్ బ్యాంకులో క్రెడిట్, హ్యూమన్ రీసోర్సెస్, బిజినెస్, బ్రాంచ్ బ్యాంకింగ్ రంగాల్లో సేవలందించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలియజేసిన కరీంనగర్ పట్టణ బిజెపినేతలు...



కరీంనగర్, జూన్ 18 : (నేటినిజం ప్రతినిధి) బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి కరీంనగర్ పట్టణ నేతలు మంగళవారం డిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసిన వారిలో మాసం గణేష్ , శశి, తోట అనిల్ , శ్రీరాములశ్రీకాంత్, కలికోట మోహన్ ,అజయ్ ,దినేష్ ,రాజేందర్ సుమన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం తమలాంటి బిజెపి కార్యకర్తలకు స్ఫూర్తినిస్తుందన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి సామాన్య కార్యకర్త నుండి కేంద్రమంత్రి స్థాయి వరకు బండి సంజయ్ కుమార్ రాణించడం సంతోషంగా ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు.

# సెషెల్స్ లోనిపోర్ట్ విక్టోరియాకు చేరుకొన్న ఐఎన్ఎస్ సునయన



న్యూఢిల్లీ, జూన్ 18 :సదర్న్ నావల్ కమాండ్ లో భాగంగా ఉన్న ఒక సముద్ర గస్తీ నౌక 'ఐఎన్ఎస్ సునయన' 2024 జూన్ 15 వ తేదీ న సెశెల్స్ కోస్ట్ గార్డ్ శిప్ (ఎస్‌సిజిఎస్) జోరావాస్టర్ తో పాటు సెశెల్స్ లోని పోర్ట్ విక్టోరియా లో ప్రవేశించింది. జోరావాస్టర్ ఇటీవలే భారతదేశం లో గార్డెన్ రీచ్ శిప్ బిల్డర్స్ ఎండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జిఆర్ఎస్ఇ) లో తన రీఫిట్ పనుల ను పూర్తి చేసుకొన్నది.

ఐఎన్ఎస్ సునయన రావడం తోనే సెశెల్స్ కోస్ట్ గార్డ్ యొక్క అధికారులు మరియు భారతదేశం యొక్క రాయబార కార్యాలయం అధికారులు స్నేహపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ నౌక తన యాత్ర కాలం లో, భారతీయ నౌకాదళం మరియు సెశెల్స్ డిఫెన్స్ ఫోర్సెస్ ల ఉద్యోగులు ఆధికారిక సమావేశాల లోను, సామాజిక సమావేశాల లోను పాలుపంచుకోవడం తో పాటుగా పరస్పరం డెక్ విజిట్స్ లో భాగం అవుతారు. ఈ నౌక పోర్ట్ విక్టోరియా లో విడిది చేసే కాలం లో, సెశెల్స్ కోస్ట్ గార్డ్ తో కలసి ఇఇజడ్ యొక్క సంయుక్త నిఘా బాధ్యతలను నిర్వహించడం జరుగుతుంది. సెక్యూరిటీ ఎండ్ గ్రోథ్ ఫార్ ఆల్ ఇన్ ద రీజన్ ( ఎస్ఎజిఎఆర్- 'సాగర్') దృష్టికోణాని కి అనుగుణం గా, భారతీయ నౌకాదళాని కి మరియు సెశెల్స్ కోస్ట్ గార్డు కు మధ్య మిత్రత్వాన్ని, ఇంకా సహకారాన్ని మరింత బలపరచుకోవాలన్నదే ఈ సందర్శన యొక్క ధ్యేయం గా ఉంది.

# వేర్వేరు సంఘటనలో రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి

హైదరాబాద్, జూన్ 18 :పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35)సోమవారం ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. నీలి రంగు ప్యాంట్, కాకి రంగు చొక్క ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు.

మృతుని వివరాల కోసం 871 2568495లో సంప్రదించాలని కోరారు.

మరో సంఘటనలో.. గుర్తుతెలియని వ్యక్తి(30) ఆదివారం అర్ధరాత్రి మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఆకుపచ్చ రంగు చొక్క, బుడిద రంగు ప్యాంట్ ధరించి,ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని పోలీసులు కోరారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.